విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

కలెక్టర్ రాజాబాబును కలిసిన ఎమ్మెల్యేలు పేర్నినాని, కైలే

విశాలాంధ్ర-మచిలీ పట్నం : స్థానిక కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఇద్దరు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బందరు, పామర్రు నియోజకవర్గాలలోని అభివృద్ధి పనులు, సమస్యలపై వారు చర్చించారు.

తాడంకి జగనన్న లేఅవుట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కైలే, జేసీ అపరాజిత

విశాలాంధ్ర-పమిడిముక్కల: తాడంకిలోని జగనన్న లేఅవుట్లను ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, జె.సి. అపరాజితసింగ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ లేఅవుట్లను ప్రజలకు ఉపయోగపడతాయా లేదానే సమస్యపై పరిశీలించి ప్రదేశం ఉపయోగకరంగా లేనిచో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే కైలే అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజ్యా లక్ష్మి యండిఒ సుధా ప్రవీణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు ప్రారంభించాల్సిందే

విశాలాంధ్ర-చల్లపల్లి : జగనన్న కాలనీల్లో నివేశనా స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహనిర్మాణాలు వారం రోజుల్లోగా గృహనిర్మాణాలు ప్రారంభించకుంటే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని చల్లపల్లి. తహసీల్దార్ కె.గోపాలకృష్ణ స్పష్టంచేశారు. చల్లపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో చల్లపల్లి, వక్కలగడ్డ గ్రామాలకు చెందిన లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకూ గృహనిర్మాణాలు చేపట్టనివారు, బేస్మెంట్లు నిర్మించి వదిలివేసిన వారిని ఒక్కొక్కరినీ పిలిచి మాట్లాడారు. ప్రభుత్వం నివేశనా స్థలాలు అందించి సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా నిర్మాణాలు ప్రారంభించలేదేమిటని అడిగారు. గృహనిర్మాణానికి ప్రభుత్వం మెటీరియల్ ఇస్తోందనీ, డ్వాక్రా మహిళలకు రుణాలు సైతం ఇస్తున్నా నిర్మాణాలు చేపట్టకపోవటం సరికాదని తెలిపారు. బాధ్యత తీసుకుని నిర్మాణాలు ప్రారంభించుకోవాలనీ, లేకుంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికిప్పుడు నిర్మాణాలు చేపట్టలేమనీ, డబ్బులు లేవంటూ పలువురు లబ్ధిదారులు చెప్పగా, నిర్మాణాలు చేపట్టినవారంతా పేదలు కాదనీ, ఎక్కువ గడువు ఇవ్వబోమనీ, వారంలో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈవోఆర్డీ బూరేపల్లి అశోక్, హౌసింగ్ ఏఈ అరుణకుమారి, కార్యదర్శి సుకుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తానని చెప్తున్న మోదీని గద్దెదించాలి : తాతయ్య

విశాలాంధ్ర-మచిలీపట్నం : విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కని ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తానని పదేపదే చెప్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దిదించాలని మేడే సందర్భంగా కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ తాటిపర్తి తాతయ్య విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ కృష్ణాజిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం మచిలీపట్నంలోని మోదుమూడి శ్రీహరి భవనంలో శుక్రవారం సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తాతయ్య మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే దినోత్సవాన్ని గర్వంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మే డే రోజు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతిజ్ఞ దినంగా పాటించాలని ఆయన కోరారు. ఎనిమిది సంవత్సరాల కాలంలో కార్మికులు, ఉద్యోగస్తుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కొంతమంది కార్పొరేట్ కంపెనీలకు అమ్మే విధానాన్ని వ్యతిరేకించాలని ఆయన అన్నారు. మే 1వ తేదీన కృష్ణా జిల్లాలోని అన్ని ప్రాంతాలలో సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగస్తులు, సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే అరుణ పతాకాలన్నీ ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు మోదుమూడి నాగరాజు, వీరభత్తుల బుజ్జి పాల్గొన్నారు.

30 నెలల్లో మచిలీపట్నం పోర్టు నిర్మాణం

విశాలాంధ్ర-మచిలీపట్నం: మేలో సీఎం మచిలీపట్నం పోర్టు పనులకు భూమి పూజ నిర్వహించిన అనంతరం 30 నెలల వ్యవధిలో పోర్ట్ నిర్మాణం పూర్తవుతుందని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ బందరు పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పోర్ట్ అభివృద్ధి పనులు పరిశీలించారు. మొత్తం 1922 ఎకరాల్లో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులు గురించి ఆరా తీశారు. ముడ మాస్టర్ ప్లాన్ పరిశీలించి, చేపట్టవలసిన పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మిత ప్రాంతం పరిశీలించారు. బ్రేక్ వాటర్ ప్రాంతం, డ్రెడ్జింగ్ ప్రాంతం, అప్రోచ్ ఛానల్ ఏరియా వరకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ, బందరు పోర్టు నిర్మాణానికి అవసరమైన భారీ యంత్రాలు, మెటీరియల్ తరలించుటకు అనువుగా పోర్టు కనెక్టివిటీ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, ఈ పనులు ఇంకా వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి పోర్టు పనులు ప్రారంభించేందుకు అంగీకరించారని, దీంతో పోర్టు సన్నద్ధత పనులు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పోర్టు పనులకు భూమి పూజ నిర్వహించిన అనంతరం పోర్టు నిర్మాణ పనులు సమీపంలో బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. పోర్టు నిర్మాణ పనులు మొదలు పెట్టుటకు అవసరమైన భారీ యంత్రాలను నిర్మాణ సంస్థ ఇప్పటికే తరలించిందని, ముఖ్యమంత్రి పోర్ట్ పనులు లాంఛనంగా ప్రారంభించగానే, నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. అనంతరం తవిసిపూడిలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఏపీ మ్యారీటైం బోర్డు ఎండి విద్యాశంకర్, ముడ విసి రాజ్యలక్ష్మి, మేఘా ఇంజనీరింగ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, రైట్స్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సూర్య, ఆర్డీవో ఐ కిషోర్, బందరు తాహిసిల్దార్ డి సునీల్ బాబు, రైట్స్ సంస్థ ప్రతినిధులు, వెంట ఉన్నారు.

రైతు సంఘం జిల్లా మహాసభ విజయవంతం చేయాలి

రైతు సంఘం జిల్లా కన్వీనర్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ

విశాలాంధ్ర-చల్లపల్లి : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా మహాసభ ను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పిలుపునిచ్చారు. రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గ సమావేశం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ మే 3న కృష్ణా జిల్లా చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో రైతు సంఘం జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు రైతుసంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని రైతు సోదరులు పార్టీలకతీతంగా తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ క్రాప్ చేసిన ప్రతీ గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రకటన చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలు కాక రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని, చివరిగింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి కోరారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట అమ్ముకోవడానికి ఇన్ని ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి తీసుకురావడం బాధాకరమన్నారు. ధాన్యం కొనుగోలు చేయలేని పక్షంలో ప్రభుత్వమే క్రాప్ హాలిడే ప్రకటించి ఉంటే బాగుండేదని హితవు పలికారు. వ్యవసాయమే గిట్టుబాటు కాని పరిస్థితుల్లో రైతులను ఇంకా కుంగ దీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న, పసుపు మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు కొనసాగించేందుకు, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు మహాసభ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మహాసభ ద్వారా రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి చేరే విధంగా రైతులు పెద్ద సంఖ్యల హాజరై మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభకు ముఖ్య అతిథులుగా రైతు సంఘం అధ్యక్షులు పి.రామచంద్రయ్య, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా రైతు సంఘం మాజీ అధ్యక్షులు పరుచూరి శ్రీనివాసరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా రైతు సంఘం అధ్యక్షులు వెలగపూడి ఆజాద్, ఉమ్మడి కృష్ణాజిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్నీడు యలమంద రావులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వేమూరి రత్నగిరిరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, రైతు నాయకులు గుత్తికొండ రామారావు, కొర్రపాటి ముఖర్జీ మాలెంపాటి కోటేశ్వరరావు బండి రామకృష్ణ, డొక్కా శ్రీనివాసరావు, పరుచూరి వెంకన్న బాబు, కోడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం..
దేశాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర-కూచిపూడి : బీజేపీని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 30 వరకు నిర్వహిస్తున్న ప్రచారభేరి కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మొవ్వ మండలంలోని కూచిపూడి పెదపూడి సెంటర్ చలసాని కాంచనరావు(సీపీఐ కార్యాలయం)లో శుక్రవారం గోడపత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22న మొవ్వలో, 24న కూచిపూడిలో, 25న కోసూరు, కాజలలో, 27న నిడుమోలులో ప్రచారభేరీ కార్యక్రమాలు నిర్వహిస్తారని, దీనిలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేస్తారని అన్నారు. దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, కార్పొరేట్ దోపిడీకి చెల్లు చీటీ, రాష్ట్ర అభివృద్ధి, సామాన్య ప్రజల రక్షణేప్రధాన కర్తవ్యం తదితర అంశాలతో కొనసాగిస్తున్న పాదయాత్రలు, ప్రచార సభలలో ప్రజలు విరివిగా పాల్గొనాలని వారి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, కూచిపూడి శాఖ కార్యదర్శి కొండా నాగేశ్వరరావు, సభ్యుడు కలపాల కిరణ్, సీపీఎం కృష్ణాజిల్లా కమిటీ సభ్యుడు శీలం నారాయణరావు, నేతలు వెంకటేశ్వరరావు, పెదముత్తే విశ్యాంసన్, కాకి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గన్నవరంలో ప్రచారభేరి

విశాలాంధ్ర-గన్నవరం : మోదీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలి, దేశాన్ని కాపాడాలని ఈ నెల 23వ తేదీ గన్నవరం మూడు బొమ్మల సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని సీపీఐ, సీపీఎం గన్నవరం నియోజకవర్గ కార్యదర్శులు పెద్దు వాసుదేవరావు, యం ఆంజనేయులు తెలిపారు. ఈ బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సీపీఐ, సీపీఎం శ్రేణులు పాల్గొంటారని, వేలాదిగా పాల్గొని సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు కాట్రగడ్డ రామచంద్ర జోషి, కట్టవరపు విజయరావు, కె వెంకటేశ్వరరావు, చౌటపల్లి రవి, మిరప నాగేశ్వరవు పాల్గొన్నారు.

ప్రచార భేరి విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ

మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గన్నవరంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించే ప్రచార భేరి జయప్రదం చేయాలని గన్నవరం పట్టణంలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతుంది : కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర-మచిలీపట్నం : ధాన్యం కొనకుండా రైతులను మోసం చేస్తుందని, వైఎస్ఆర్సిపి దగా ప్రభుత్వాన్ని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ చేస్తున్న యాత్ర 1000 కిలోమీటర్లకు చేరుకుందని దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన దగ్గరకు వెళ్లి గమనిస్తున్నారని, ఈ రాష్ట్ర ప్రభుత్వం చేతకాని ప్రభుత్వం వల్ల ప్రజలు నాన్న కష్టాలు పడుతున్నారని ఆ బాధలను నారా లోకేష్ గమనిస్తున్నారని ఆయన విన్నవించారు. రేయనగా పగలనకా రైతులు కష్టపడుతూ పండించుకున్న ధాన్యాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం కొనలేక చేతులెత్తేసిందని ఇది ముమ్మాటికి రైతుల కు ద్రోహం చేసినట్లేనని ఆయన అన్నారు. బందర్ లో మట్టి మాఫియా స్థానిక ఎమ్మెల్యే అండదండలతో నిత్యం వందలాది ట్రక్కులతో అమ్ముతున్నారని అడ్డుకుంటున్న మాపై కూడా మట్టి మాఫియా దౌర్జన్యానికి తెగ పడుతుందన్నారు. ఇదంతా పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, మట్టి మాఫియా పై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని లేనియెడల పెద్ద స్థాయిలో ఉద్యమం చేపడతామని కొల్లు అన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, గోపు సత్యనారాయణ, పంచికర్ల కాశి విశ్వనాథ్, బొద్దు నాగరాజు, లంకి శెట్టి నీరజ, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-మచిలీపట్నం : స్థానిక ఈడేపల్లిలో ఈడేపల్లి గానుగకొట్టు వీధిలో ఒక బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం 6:45 గంటలకే బాలిక మరణించి నట్లుగా చిలకలపూడి పోలీసులు నిర్ధారించారు. చిలకలపూడి సీఐ రాజశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ గంజాల జూలీ (13) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. పోలగాని సింహాద్రి ఇంట్లో, జూలీ, జూలీ తల్లి పద్మ అద్దెకు నివసిస్తు న్నారు. జూలీ తల్లి పద్మ, జిల్లా కోర్టు సెంటర్ వద్ద సాయిబాబా గుడి సమీపంలో టీ స్టాల్ నడుపుతూ జీవనం సాగిస్తుందన్నారు. స్థానిక దిమ్మల సెంటర్ లక్ష్మణరావు పురం నుండి సంవత్సరంన్నర క్రితం ఈ ఇంట్లోకి అద్దెకు వచ్చారన్నారు. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ సాయం అందిస్తున్నారని సీఐ తెలిపారు. గురువారం రాత్రి తల్లి పద్మ, ఇంట్లో రూ.6 వేలు పోయాయని కుమార్తెని మందలించినట్లు తెలియవచ్చిందని, ఉదయం 6 గంటలకు తల్లి పద్మ తన టీ స్టాల్ వద్దకు వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లినట్లుగా తెలిపారు. ఒంటరి మహిళగా నివసిస్తున్న గంజాల పద్మకుమార్తె జూలీ మరణం అనేక అనుమానాలకు తావిస్తోందని పలువురు చర్చించుకోవడం విశేషం. అసలు అనీల్ కుమార్ ఎవరు? జూలీ తల్లికి నిజంగా సాయం చేసే వ్యక్తా? లేక జూలీతల్లితో సహజీవనం చేస్తున్నాడా? అనేక అనుమానాలు ఈ ఆత్మహత్యలో చోటు చేసుకున్నాయని స్థానికులు చర్చించుకోవడం గమనార్హం. జూలీ స్థానిక ప్రధాన మున్సిపల్ పార్కు వద్ద ఉన్న స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్నట్లుగా తెలిసింది. స్కూల్‌కి వెళ్లి ఉంటుందని భావించిన తల్లి, అనీల్‌కుమార్‌తో ఉదయం ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చి చూడగా, ఇంట్లో ఉన్న ఐరన్ రాడ్‌కి చున్నీతో, గుడ్డలు కట్టి ఉరి వేసుకున్నట్లు గుర్తించి అనిల్‌కుమార్ సాయంతో జూలీని కిందకు దింపి మంచం మీద పడుకోబెట్టి పోలీసులకు జూలీ తల్లి ఫిర్యాదు చేశారని అన్నారు. చిలకలపూడి పోలీసులు, సిబ్బంది వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. జూలీ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామని, సమగ్ర దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. జూలీ ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేపట్టామని సిఐ రాజశేఖర్ అన్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జూలీ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పౌరులకు ఉత్తమ సేవలందించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : పరిపాలనా వ్యవస్థకు మూల స్థంబాలుగా వ్యవహరిస్తూ పౌరులకు ఉత్తమ సేవలు అందించడమే సివిల్ సర్వెంట్ల లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. శుక్రవారం జాతీయ పౌర సేవల దినోత్సవం (నేషనల్ సివిల్ సర్వీసెస్ డే) పురస్కరించుకుని స్పందన సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జాయింట్ కలెక్టర్ డా. అపరాజితసింగ్తో కలసి అధికారులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులకు సేవ చేయడం కోసం సివిల్ సర్వెంట్లు తమను తాము తిరిగి అంకితం చేసుకునేందుకు, ప్రజాసేవ, పనిలో శ్రేష్టతను వారి కట్టుబాట్లను పునరుద్ధరించడానికి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న సివిల్ సర్వీసెస్ డేని భారత ప్రభుత్వం జరుపుకుంటుందన్నారు. 1947లో స్వతంత్ర భారత దేశపు మొదటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఆఫీసర్ల ప్రొబేషనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న సివిల్ సర్వెంట్లు దేశ పరిపాలన వ్యవస్థకు మూల స్థంబాలుగా వ్యవహరిస్తారు అన్న ఆయన మాటలను ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకుని పౌరులకు సేవలు అందించడంలో ఎలాంటి తారతమ్యం చూపకుండా, అవినీతిరహిత సేవలు అందించడానికి అధికారులు నిత్యం కృషి చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చైతన్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండండి : మంత్రి జోగి

విశాలాంధ్ర-పెడన: అధికారులందరూ నిరంతరం ప్రజలకు జవాబు దారితనంగా ఉండాలని, ప్రజల సమస్యలు తీర్చడంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని మంత్రి జోగి రమేష్ సూచించారు. పెడన పట్టణ మార్కెట్ యార్డ్ సమావేశ మందిరం నందు కృత్తివెన్ను మండలానికి చెందిన రెవెన్యూ, గ్రామీణ, మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, హౌసింగ్, విద్యుత్ శాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ తదితర కీలక శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది మరియు కృత్తివెన్ను మండల ప్రజా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి జోగి.రమేష్ పై విధంగా పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవికాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలకు స్వచ్ఛమైన మరియు సురక్షిత మంచినీరు అందించే విధంగా అన్ని రకాల చర్యలు చేపట్టాలని మంత్రి గ్రామీణ మంచినీటి సరఫరా అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు ఎవరు కూడా దాహార్తితో బాధపడకూడదు అని అలాంటి సమస్యలు మరలా తన దృష్టికి వస్తే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశం మార్కెట్ యార్డ్ చైర్మన్ కొల్లాటి గంగాధరరావు, జడ్పిటిసి మైలా.రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు వైదాని వెంకటరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లా.సూరిబాబు సచివాలయాల మండల కన్వీనర్ కొక్కిల గద్ద.బాబ్జి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు వల్లబు బాబురావు, నాయకులు పాల్గొన్నారు.

ఇదేమి కర్మ మన రాష్ట్రానికి స్వల్ప మార్పు

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, నిత్యవసర ధరలు ఆయిలు తదితర వస్తువుల పెంపుపై ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో స్వల్ప మార్పు జరిగినట్లు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు శుక్రవారం తెలిపారు. మసిముక్కు మాట్లాడుతూ మండలంలోని భూషణగూళ్ల గ్రామంలో శుక్రవారం జరగవలసిన కార్యక్రమం ఆదివారం జరుగుతున్నందున మండలంలోని టిడిపి శ్రేణులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

మార్కెట్‌లోకి 'క్లబ్ హెచ్‌పీ పానీ'

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): హెచ్‌పిసిఎల్ వారి అన్ని ఔట్‌లెట్స్‌లలోని కస్టమర్ల కోసం వారి స్వంతబ్రాండ్ హెచ్‌పి పానీ (ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్) ప్రారంభించారు. ఈ రోజు విజయవాడ రీటైల్ రీజియన్‌లోని అన్ని హెచ్‌పిసిఎల్ ఔట్‌లెట్స్‌లో దీన్ని మార్కెట్‌లోని విడుదల చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ఆటోనగర్‌లోని అరుణశ్రీ ఫిల్లింగ్ స్టేషన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బి.చంద్రమౌళి, జనరల్ మేనేజర్ హైవే రీటైలింగ్ దీనిని మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పి.రవిశంకర్, డి.జి.ఎం. రీటైల్, విజయవాడ, ఎస్.విల్సన్, చీఫ్ మేనేజర్, ఆర్ఇ & ఎనాలటెక్స్, విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ మేనేజర్, సేల్స్, కె.జనార్ధన్, అరుణశ్రీ పెట్రోల్‌బంకు (డీలర్) మరియు విజయవాడలోని అందరూ డీలర్స్, కస్టమర్స్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి-ఆభరణాల ఛోరీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కోసూరు లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి నగలు అపహరించి పరారైన దుండగుల ఉదంతం శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవా రుజామున మాజీ సర్పంచ్ గోగినేని కుటుంబరావు భార్య బేబీ సరోజిని ఒంటరిగా హైస్కూల్ రోడ్‌లోని లైబ్రరీ సమీపంలో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఇంటిలోకి కిటికీపూచలు తొలగించి ముసుగులు ధరించిన ఇద్దరు యువకులు లోలపికి వచ్చి నిద్రిస్తున్న వృద్ధురాలిని తాళ్లతో నిర్బంధించి ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, బంగారు గాజులు (సుమారు 8.5 నవర్సులు)ను తీసుకొని వెళ్లిపోయారు. అనంతరం ఆమె వేసిన కేకలకు ఇంటి పక్క వారు వచ్చి చూడడంతో ఈ విషయం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న కూచిపూడి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని గుడివాడ డీఎస్పి ఎస్ సత్యానందం, పామర్రు సీఐ ఎస్ వెంకటనారాయణ, కూచిపూడి ఎస్ఐగా ఇన్చార్జిగానున్న పామర్రు ఎస్ఐ శ్రావణకుమార్‌రెడ్డి, కూచిపూడి ఏఎస్ఐ ఎం పూర్ణచంద్రరావులు విచారణ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీఆర్ శతజయంతి నాటకోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: తపస్వి కల్చరల్ ఆర్ట్స్,ఎస్ వి ఆర్ కళా కేంద్రం,కొడాలి బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు హనుమంతరాయ గ్రంథాలయం హాలులో జరిగే ఎన్ టి ఆర్ శతజయంతి నాటకోత్సవములు శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల సప్తమ ఆహ్వాన నాటకోత్సవాలుగా నిర్వహిస్తున్న మూడు రోజుల నాటకోత్సవాలను తపస్వి అధ్యక్ష,కార్యదర్శులు వేముల హజరత్తయ్య గుప్తా, సూర్యదేవర జగన్నాథరావుల పర్యవేక్షణలో బొర్రా నరేన్, బాయున శ్రీనివాసరావు, పరుచూరి సుందరరావు తదితరులు నిర్వహణ చేశారు. నాటకోత్సవాలను అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు జ్యోతి ప్రకాశనం చేసి మాట్లాడుతూ రంగస్థలం సినీ రంగానికి మాతృక అని, నాటక రంగానికే జీవితాన్ని ధారపోసి రాత్రనకా పగలనకా చేసినటువంటి కృషిని ప్రేక్షకుల ముందు ప్రత్యక్షంగా ప్రదర్శించి ప్రతిభను చాటుకుని పేరు గడించేందుకు తపన కలిగించే రంగస్థలం మహోన్నతమైనదని,భవిష్య త్తరానికి రంగస్థలం వైభవం తెలియటానికి వీటిని పరిరక్షించుకునే అవసరం ఎంతైనా ఉందన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ప్రజా తిరుబాటుతో బీజేపీని తరిమి కొడదాం...

దేశ భవితను కాపాడుకుందాం

-సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీ.హెచ్.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-మైలవరం : బరితెగించిన మతోన్మాదంతో దేశ విచ్ఛిన్నానికి, వినాశకర, నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజా తిరుబాటుతో తరిమి కొట్టి బీజేపీ విషపుకోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న మనదేశాన్ని, దేశ భవితను కాపాడుకుందామని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు నొక్కి వక్కాణించారు. మైలవరం మండల పరిధిలోని పోరాటనగర్‌లో ప్రచార భేరి 8వ రోజు శుక్రవారం జరిగిన కార్యక్రమానికి స్వయంగా నాయతక్వం వహించి సీపీఐ కార్యకర్తలతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బీజేపీని మరోసారి అధికారంలోకి రానిస్తే దేశ భవిష్యత్ పూర్తిగా నాశనమవుతుందన్నారు. ఇప్పటికే రక్షణ రంగంతో సహా మొత్తం ప్రభుత్వ సంస్థలను కార్పోరేట్స్‌కు ధారదత్తం చేశారని మండిపడ్డారు. వ్యవసాయాధారితమైన మన దేశంలో అత్యంత కీలకమైన వ్యవసాయ రంగాన్ని కూడా కార్పోరేట్స్‌కు కట్టబెట్టే మూడు చీకటి చట్టాలను తీసుకురావడం, దీనిపై రైతాంగం చేసిన చారిత్రాత్మక తిరుగుబాటుతో తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని గుర్తు చేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలుగుప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకైన విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా వదలటం లేదన్నారు. ప్రత్యేక హెూదా, ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వలేదని, పోలవరానికి ఇచ్చే నిధుల్లో కోత పెట్టారని తెలిపారు. కేంద్రం రాష్ట్రానికి ఇంత దగా చేస్తున్నా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుందని విమర్శించారు. దేశంలో రాజ్యాంగం లేదు, ప్రజాస్వామ్యం అసలే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం ఇలాంటి విపత్తులతో కొట్టుమిట్టాడుతున్నదు ఈ దేశ పౌరులుగా దేశాన్ని రక్షించుకోవటం కోసం తిరుగుబాటు తప్పదని కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి కారుమూరి రత్నకుమారి, డి.మార్గరేట్, భుక్యా బుజ్జి, మందా మేరి, భుక్యా నాగమ్మ, అజ్మీర్ బుజ్జి, పి.రాణి, కాటూరి నాగేశ్వరరావు, మందా ఎలీషారావు, ఉలాస మరియకుమార్, మూర్త గురవయ్య, ప్రత్తిపాటి ఫ్రాన్సిస్, పి.దాస్, అజ్మీర్ అయ్య, నమ్మిక శ్రీనవాసరావు తదితరులు నాయకత్వం వహించారు.

వ్యవస్థల్ని నియంత్రిస్తున్న బీజేపీని ఇంటికి పంపిద్దాం

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో మూడు శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల్ని తన చెప్పుచేతల్లో పెట్టుకుని నియంత్రిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటింకి పంపించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీ సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సీపీఐ, సీపీఎం నగర సమితిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి 8వ రోజు శుక్రవారం కొనసాగింది. మధురానగర్ పప్పుల మిల్లు వద్ద ప్రచారభేరి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ బాల్కిస్ బాను అత్యాచారం కేసులో దోషులను విడుదల చేశారని, ప్రధాని విద్యార్హతలను సమాచార చట్టం ద్వారా అడిగినందుకు ఢిల్లీ సీఎంకు జరిమాన విధించారని, ఎవరైన మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారని తెలిపారు. పెట్రోల్, డీజీల్, గ్యాస్ ధరలు పెంచటంతో నిత్యావసరాల ధరలు ఆకాశనంటుతున్నాయని చెప్పారు. ఇక మన రాష్ట్రానికి మోదీ అన్యాయం అంతా ఇంతా కాదన్నారు. విభజన హామీలను అమలు చేయలేదన్నారు. రాష్ట్రానికి ఆయుపట్టు లాంటి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయలేని దౌర్భగ్య స్థితిలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలపై పన్నుల భారాలను మోపుతుందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజలకు అన్యాయం చేస్తున్న బీజేపీ, వైసీపీలను ఇంటింకి పంపించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎం పశ్చిమ కృష్ణాజిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో 20లక్షల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన మోదీ ఆ డబ్బులను ప్రజలకు కాకుండా కార్పోరేట్‌లకు ఇచ్చారని ఆరోపించారు. బొగ్గు గనులు, ఓడరేవులు, విమానాశ్రయాలు, 190 రైల్వేలైన్లు, 26వేల కీలోమీటర్ల జాతీయ రహదారులను ప్రైవేటు సంస్థలకు అప్పగించారని చెప్పారు. ఈ సంపదను తెచ్చింది ఎవరు? ఇచ్చింది ఎవరు ? అని ప్రశ్నించారు. మోదీ అండదండలతో అదాని ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిండెన్ బర్గ్ బట్టబయలు చేసిందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బీజేపీని వైసీపీ ఒక్కమాట అనటం లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం కోసం ప్రజాస్వామ్య వాదులు ముందుకు వచ్చి సీపీఐ, సీపీఎం పార్టీలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారభేరి మధురానగర్ పప్పుల మిల్లు, పసుపుతోట, కొబ్బరితోట, శ్రీనగర్ కాలనీ, టీచర్స్ కాలనీ, గవర్నమెంట్ ప్రెస్, ఎన్టీఆర్ సర్కిల్, పటమట, ఆటోనగర్ గేట్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, కార్యవర్గ సభ్యులు డివి.రమణబాబు, కొట్టు రమణరావు, అప్పురబోతు రాము, తూనం వీరయ్య, కొడాలి ఆనందరావు, దుగ్గిరాల సీతారావమ్మ, గూడెల జనార్ధన్, చింతాడ పార్వతి, దుర్గాసి రమణమ్మ, ప్రత్తిపాటి రాజు, లంక ప్రసాద్, లంక నాగమణి, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయికుమార్, బి.శాంతి పడాల.భాగ్యలక్ష్మి, పగిడికత్తుల రాము, పి.కనకరావు, సింగరాజు సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకులు కె.శ్రీదేవి, జి.రామన్న, నగర నాయకులు బి,రమణరావు, తదితరులు పాల్గొన్నారు.

సంఘ్ ప్రభావంతో మోదీ పాలన

విశాలాంధ్ర-ఏ.కొండూరు : మతోన్మాద సంఘ్‌పరివార్ ప్రభావంతో కేంద్రంలో నరేంద్ర మోదీ రాజ్యం ఏలుతున్నారని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. మోదీ హఠావో! దేశ్ కిబచావో!! నినాదంతో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక అమరవీరుల స్థూపం నుంచి బహిరంగ సభ వరకు జాతీయ రహదారిపై భారీ ప్రదర్శన జరిగింది. అనంతరం సీపీఐ ఏ.కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో శంకర్ మాట్లాడుతూ దేశ సంపదను అదానీ, అంబానీలకు మోదీ గంపగుత్తగా దోచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. అదాని అక్రమ ఆస్తుపై పార్లమెంటు జాయింట్ కమిటీని వేయమని అడిగినందుకు రాహుల్ గాంధీని పార్లమెంట్‌కు అనర్హత వేటువేయటం పరాకష్ట అన్నారు. బీజేపీ విధానాలను అడ్డుకోవాల్సిన వైసీపీ తెలుగువారి ఆత్మగౌరవాన్ని మోదీ పాదక్రాంతం చేశారని దుయ్యబట్టారు.

రాజధానిలేని రాష్ట్రంగా అవతరించటానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కారణం అన్నారు. బీజేపీకి బీ2 పార్టీగా వైసీపీ పని చేస్తుందని పేర్కొన్నారు. ఏ.కొండూరు మండలంలో కిడ్నీ బాధితుల సమస్యపై ప్రభుత్వం సరైన సర్యలు చేపట్టలేదన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడటం కోసం మండలంలో కిడ్నీ ఆసుపత్రిని తక్షణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మతోన్మాద బీజేపీని దానికి వంత పాడుతూ రాష్ట్రానికి ద్రోహం వైసీపీ సాగనంపాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటానికి లౌకిక, ప్రజాస్వామ్యవాదులు మద్దతు ఇవ్వాలని కోరారు. సీపీఎం పశ్చిమకృష్ణాజిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశంలో రైతాంగ, వ్యవసాయ రంగ సమస్యలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. స్మార్ట్‌మీటర్లు మీటర్లు పెట్టి రైతులను కొల్లగొడుతుందన్నారు. బీజేపీ, వైసీపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దాడి ఆదినారాయణ, మేకల కుమారి, పాణం ఆనందరాఉవ, షేక్.కరిముల్లా, సీహెచ్.సర్వేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు, కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో విస్తృతంగా ప్రచారభేరి

విశాలాంధ్ర-తిరువూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన మోదీ హటావో - దేశ్ బచావో ప్రచారభేరి కార్యక్రమం శుక్రవారం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య మాట్లాడుతూ కార్పోరేట్ కంపెనీల కనుసన్నల్లో పాలన చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, నష్టాల సాకుతో ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదాని లకు అప్పజెప్పి పనిలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొత్తపల్లి సుందరరావు, ఎస్ కే నాగుల్ మీరా, మాలపాటి ఉదయ్, బాణాల అశోక్, బనాల ముత్తయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు మార్కట్ల ప్రభాకర్, సాంబారు వెంకటేశ్వర్లు, ఆకుల రవి, ఎస్వీ భద్రం, పంతంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం...దేశాన్ని రక్షిద్దాం...

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కేంద్ర వామపక్షాల కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు విస్సన్నపేటలో సిపిఐ శ్రేణులు శుక్రవారం బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని రక్షిద్దామంటూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డు, సత్తుపల్లి రోడ్డులలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు మాట్లాడుతూ, ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జరిగిన కార్పొరేట్ మోసాలు, పేద ప్రజానీకంపై అధిక ధరల రూపంలో జరుగుతున్న వేధింపులను వివరించారు. పలు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ప్రజాబలంతో ఎన్నికైన పాలకులను గద్దె దింపేందుకు స్వార్థపూరిత కుట్రలు పన్నటం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మోతే శోభనాచలం, పతకమూడి నాగేశ్వరరావు, పితాని నాగేశ్వరరావు, గోలి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని గద్దె దింపి తరిమి కొడదాం

విశాలాంధ్ర-గంపలగూడెం : భారతదేశంలో మతోన్మాద బీజేపీని గద్దె దింపి ప్రజలను కాపాడుకుందాం అని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా అన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రచార బేరిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మతోన్మాద బీజేపీ ప్రజల మధ్య మతవిద్వేషాలకు కు అగ్గిరాజేస్తుందని, అంబాని, ఆదానీల వంటి వారికి దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. సీపీఎం నాయకులు జనార్ధన చారి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని భారతీయ జనతా పార్టీని ఓడించి దేశాన్ని కాపాడుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధి కొండలరావు, బట్ట గాని పూర్ణయ్య, ఎస్ కే యూసుఫ్, తెనాలి నాగేశ్వరరావు, వట్టికొండ కృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి గువ్వల సీతారాంరెడ్డి, నాయకులు ఎం కుటుంబరావు, ఎన్ జనార్ధనచారి, గుంటుపల్లి వీరభద్రరావు, వడ్డెరపు. మాధవరావు, బెజవాడ గోపి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రంజాన్ కార్యక్రమ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే వీ.శ్రీనివాసరావు, నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మీ, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. గాంధిజీ కళాశాల, విధ్యాధరపురం షాదిఖానా, మోతి మస్జిద్ ఈద్గాహ్, స్టేడియం, సితార సెంటర్‌ను కూడా వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు నమాజ్ చేసుకొనేందుకు అవసరమైన ఏర్పాట్లు, షామియానా, కార్పెట్, త్రాగునీరు మౌలిక సదుపాయాలతో పాటు పరిసరాలన్నీ పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంబందిత అధికారులకు సూచించారు. రంజాన్ రోజున నగర పరిధిలో నమాజ్ చేసుకునే అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకువాలన్నారు. ఆయా ప్రదేశాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, రోడ్ మార్జిన్లలో చెత్త, డెబ్రిస్ లేకుండా తక్షణమే వాటిని తొలగించి మార్జిన్‌లను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఏఐవైఎఫ్‌కు ఎక్సైజ్ అధికారి హామీ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టి నగర్) : వేకువజామున మద్యం షాపు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఐవైఎఫ్ కు ఎక్సైజ్ అధికారి హామీ ఇచ్చినట్లు ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బెవర శ్రీనివాసరావు తెలిపారు. మార్చి 28 న చిట్టినగర్ సెంటర్లోనూ, మరోసారి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఉదయం 5 గంటలకే బార్లు తీస్తున్నారని నిరసన కార్యక్రమాలు చేపటిన్ట అనంతరం కలెక్టర్ ఢిల్లీ రావు, ఎక్సైజ్ శాఖ అధికారి ఎస్పై యనమల ఈశ్వర్ రావులను బార్లు పై చర్యలు తీసుకోవాలని కోరటం జరిగిందని గుర్తు చేశారు. కలెక్టర్ అదేశానుసారం వారం రోజుల్లో బార్లు, వైన్ షాపులపై తనిఖీలు నిర్వహిస్తామని విజయవాడ నగర యువజన సమైక్య అధ్యక్ష కార్యదర్శులు కాళ్ల విజయ్, బెవర శ్రీనివాసరావులకు హామీ పత్రం అందించారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తూ తరగతుల నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలల పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ : విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తూ తరగతుల నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ విజయవాడ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కార్యదర్శి మందగళ్ళ సాయికుమార్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే ముందస్తుగా అడ్మిషన్లు పూర్తి చేసి తరగతులు నిర్వహిస్తుంటే కార్పొరేట్ కళాశాల పైన చర్యలు చేపట్టకుండా మౌనంగా ఉన్న ఆర్ఐఓ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కళాశాలల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు ఎరవేసి ఏప్రిల్ లో అడ్మిషన్ చేసుకుంటే ఒక ఫీజు మేలోఅడ్మిషన్ చేస్తే మరొక ఫీజు అని లేట్ చేస్తే మీకు అడ్మిషన్లు అయిపోతాయని విద్యార్థుల తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఆర్ఐఓ వెంటనే ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు అయ్యప్ప ,శివా ,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయవాడ : ఐఎస్‌టీఎస్ఓ ఒలంపియాడ్ రెండవ లెవల్‌లో తమ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారని శ్రీచైతన్య స్కూల్ మారుతీ నగర్ బ్రాంచ్ ప్రిన్సిపల్ సుజన తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో గెలుపొందిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థల ఈజీఎం మురలీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో లక్ష్యాన్ని చేరుకోవాలంటే, అత్యంత అనుభవం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో, అద్భుతమైన పాఠ్య ప్రణాళికతో విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మారుతీనగర్ బ్రాంచ్ ఏడవతరగతికి చెందిన మాధుర్యరాజ్ మొదటి బహుమతిగా లెనోవో ట్యాబ్‌ను, ఐదవ తరగతికి చెందిన సహస్రకు రెండవ బహుమతి స్మార్ట్ వాచ్‌ను, మిగిలిన విద్యార్థులకు 35 ప్రత్యేక బహుమతులు, 92మందికి గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమములో ఆర్.ఐ. రాజేష్‌బాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ వెంకటశివ, డీన్. రామారావు, సి.ఇన్‌చార్జీ రామాంజనేయులు, ప్రైమరి ఇన్‌చార్జి రమాదేవి మరియు ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తలిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదానికి రూ.10,116 విరాళం



విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నిత్య అన్నదాన పథకమునకు జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామ వాస్తవ్యులు డోగుపర్తి లక్ష్మణరావు, విజయలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేసినారు. వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదములు అందజేసినారు.

తిరుపతమ్మ సన్నిధిలో మజ్జిగ పంపిణీ

తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం మజ్జిగపంపిణీ చేశారు. పల్నాడు జిల్లా గురజాల వాస్తవ్యులు చీతిరాల వెంకటరమణ కుటుంబ సభ్యులు చీతురాల హనుమాయమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ వితరణ చేసినారు. దేవాలయ కార్యనిర్వహణ అధికారి. జీవిడిఎన్ లీలా కుమార్. చైర్మన్ ఇంజం కేశవరావు ఆదేశములు అనుసరించి ఆలయ ఇంజనీరింగ్ విభాగము వారు చలువ పందిళ్ళు కూలింగ్ క్లాత్ పందిళ్లు దేవాలయం చుట్టూ ట్యాంకర్‌తో భక్తులకు అసౌకరాలు కలుగుకుండా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు రంజాన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ముస్లీంలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పండుగ శనివారం జరుగనున్నది. దీంతో 30 రోజుల ముస్లీం ఉప వాస దీక్షలు ముగియనున్నాయి. గల్ఫ్ దేశాల్లో శుక్రవారం పండుగ జరుపుకోవడంతో ఆకాశంలో నెలవంక కనిపించిందని, ముస్లీం ప్రజలు శనివారం రంజాన్ (ఈద్ ఉల్ ఫీతర్) ప్రార్థనలు జరుపుకోవాలని మత ప్రముఖులు పిలుపునిచ్చారు. జిల్లాలో ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు సామూహిక ప్రార్థనలు జరగనున్నాయి.

VIMS COLLEGE OF PHYSIOTHERAPY
Narravari Street,Satyanarayanapuram
VIJAYAWADA - 520 011.

Applications are invited for Admissions into **MPT** course duration of 2 years from the intended Candidates under Management Quota Seats Min. qualification for Admission is **BPT** pass.

Secretary & Correspondent

నందిగామ ఎమ్మెల్యేకు చేదు అనుభవం

విశాలాంధ్ర-వీరులపాడు: అల్లూరులో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు కు చేదు అనుభవం ఎదురయింది.శుక్రవారం అల్లూరు గ్రామంలో నిర్వహిం చిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నందిగామ శాసనసభ్యుడు ఇంటింటికి వెళ్లి వైకాపా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న సందర్భంలో అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు మా ఇంటి వద్ద డ్రైనేజీ సమస్య ఎప్పుడు నెరవేరుతుందని, తమకు ఫీజు రీయింబర్స్మెంట్ ఎప్పుడు పడుతుందని జగన్మోహన్ రావు ను ప్రశ్నించాడు. అనుకోని సంఘటన ఎదురవటంతో మండల వైకాపా నాయకత్వం మండల పార్టీ కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, మాజీ జెడ్పిటిసి సభ్యులు కోటేరు ముత్తారెడ్డి నీకు ఏం తెలుసు అని మాట్లాడుతున్నావ్, నువ్వు కావాలని నీకు సంబంధం లేని విషయం అడుగుతున్నామని అసహనం వ్యక్తం చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన కుమ్మరి కుంట ఆక్రమణ విషయంలో ఫిర్యాదు చేసినందుకు తనపై కేసులు నమోదు చేశారని నవ్వులూరి వెంకటేశ్వర్లు అనే వృద్ధుడు ఆరోపించగా దానికి ప్రతిస్పందనగా మండల నాయకులు కేసు నమోదు చేయలేదని రాజీ మాత్రమే చేశామని ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ రెండు సంఘటనలు అనూహ్యంగా జరగడంతో కార్యక్రమం అనంతరం వైకాపా మండల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ని ప్రశ్నించిన యువకుడిని ఉద్దేశిస్తూ ఆ యువకుడు ఉద్దేశపూర్వకంగానే సంబంధం లేని ప్రశ్నలు అడిగాడని, ఆయన యువకుని కుటుంబం జగనన్న సంక్షేక పథకాల ద్వారా లక్షల రూపాయలు లబ్ధి పొంది ఉన్నారని అతని మాటల్లో నిజం లేదని, అక్కడ జరిగిన సంఘటనను తీవ్రంగా ఖండించారు.

ప్రైవేటు బస్సు బోల్తా-నలుగురికి స్వల్ప గాయాలు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడ గొల్లపూడి వై జంక్షన్ వద్ద ప్రైవేటు బస్సు బోల్తా పడింది. విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్తున్న బీఏఎస్ఆర్ ప్రైవేటు బస్సు గొల్లపూడి వై జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఎలక్ట్రికల్ స్తంబాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున నలుగురికి స్వల్పగాయాలైయ్యాయి. బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నారు. భవానీపురం పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు. గాయాపడిన వారికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల సంక్షేమానికి సహకార సంఘాల ఎనలేని కృషి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వారికి పెద్దపీట వేస్తు అనేకమైన పథకాలను అమలు చేస్తున్నారని, వాటిలో ముఖ్యంగా సహకార సంఘాల ద్వారా రైతులకు చేయూత నిస్తూ వారి బలోపేతానికి సొసైటీలు కృషి చేస్తున్నాయని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అయ్యప్ప నగర్ నందు ది.కృష్ణ ఫార్మర్స్ సొసైటీ నూతన కమిటీ ప్రమాణస్వీకార మహెూత్సవానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ది.కృష్ణ ఫార్మర్స్ సొసైటీ నూతన అధ్యక్షులుగా నియమితులైన చలమల శ్రీనివాస్, డైరెక్టర్లుగా కారుపాటి జీవరత్నం, పల్లెబోయిన సూరమ్మలకు నియామకపత్రాలు అందజేసి వారిని అభినందించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ సొసైటీలు ప్రభుత్వం రైతులకు అందించే అనేక సంక్షేమ పథకాలను, రుణాలను,సకాలంలో అందజేస్తు వారి ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు వెన్నుదన్నుగా నిలిచేది సహకార సంఘాలేనని,అంతేకాకుండా పొదుపు సంఘాలకు,వ్యవసాయ అనుబంధ విభాగాలైన వివిధ వృత్తుల వారికి కూడా రుణ సౌకర్యాలను కల్పిస్తూ వారు బలోపేతానికి కృషి చేస్తున్నది కూడా సహకార సంఘాలేనని అన్నారు.ది.కృష్ణ ఫార్మర్స్ సొసైటీ నూతన అధ్యక్షులుగా నియమితులైన చలమల శ్రీనివాస్ సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతు సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ది.కృష్ణ ఫార్మర్స్ సొసైటీ ద్వారా 10 పొదుపు సంఘాలలోని అక్కా చెల్లెమ్మలకు 1 కోటి 20 లక్షల రూపాయల రుణాల చెక్కులను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు,మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్,మండల పార్టీ అధ్యక్షులు మండవ శ్రీనివాస్ గౌడ్,గ్రామ పార్టీ అధ్యక్షులు జొన్నబట్ల సతీష్ శర్మ,మాజీ సర్పంచ్ గుర్రం నరసింహారావు,మాజీ ఎంపీటీసీ కాకనబోయినా ఆదినారాయణ,మాజీ దేవస్థానం చైర్మన్ కాకనబోయిన నరసింహారావు,అక్షరా ఫౌండేషన్ నిర్వాహకురాలు కాకనబోయినా చైతన్య,నాయకులు కూచిపూడి సుధాకర్,నాగరాజు,మోరే సురేష్,ఆకుల కృష్ణకుమారి జొన్నబోయిన నాగలక్ష్మి,వివిధ గ్రామాల ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీఓఎంగా సత్య స్వరూప్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పెరుమాళ్ల సత్య స్వరూప్ (ఐఆర్‌టిఎస్) శుక్రవారం డివిజనల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈయన 2015 ఐఆర్‌టిఎస్ బ్యాచ్‌కి చెందినవారు. ఇంతకు ముందు తూర్పు రైల్వేలోని హౌరా డివిజన్‌లో గూడ్స్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తూ విజయవాడ డివిజన్‌కు బదిలిపై వచ్చారు. నంద్యాల జిల్లాకు చెందినవారు. ఎస్ఎస్ఐఎస్‌టి హైదరాబాద్ నుండి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో బి. టెక్ పూర్తి చేశారు. 2019 సంవత్సరంలో భారతీయ రైల్వేలోకి ప్రవేశించారు. చిత్తూర్ ఏరియా అధికారి, ఎఒఎమ్, గూడ్స్, సీల్దా డివిజన్‌గా పని చేశారు. 2021-2022 ఆర్థిక సంవత్సరానికి హౌరా డివిజన్‌లో అత్యధిక లోడింగ్‌ను సాధించినందుకు అతను 'బెస్ట్ ట్రాఫిక్ ఆఫీసర్'గా జీఎం అవార్డును అందుకున్నారు. డిఆర్ఎం శివింద్రమోహన్, ఏడిఆర్ఎంలను కలిశారు.

72 లక్షల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలి

డ్వామా పీడీ జే.సునీత

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఉపాది హామీ పథకం ద్వారా జిల్లాలో ఈ ఏడాది 72 లక్షల పనిదినాల లక్ష్యాన్ని సాదించాలని, కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన సరాసరి రోజు వేతనం రూ.272 కల్పించేందుకు కృషి చేయాలని డ్వామా పీడీ జే.సునీత నీటి యాజమాన్య సంస్థ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఉపాది హామీ పథకం పనులు వేగవంతంపై స్థానిక గొల్లపూడిలోని డ్వామా పీడీ కార్యాలయంలో పీడీ శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాదించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 6లక్షల పనిదినాలు కల్పించామని, వేసవిని దృష్టిలో పెట్టుకుని పని కోరిన ప్రతి కూలీకి ఉపాది కల్పించాలన్నారు. కూలీల మస్తరు పని వివరాలు ఏ రోజుకారోజు నమోదు చేసి సకాలంలో వేతనాలు చెల్లించేందుకు కృషి చేయాలన్నారు. వేసవిలో కూలీలకు తాగునీరు, ఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్స కిట్లు, సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ పీడీ మణికుమార్, జిల్లాలోని అసిస్టెంట్ పీడీలు, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ అపరేటర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్ డిసి సాంకేతికతతో ప్రపంచంలోని మొదటి ఎయిర్ కూలర్ ని విడుదల చేసిన సింఫనీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎయిర్ కూలర్లలో గ్లోబల్ లీడర్ అయిన సింఫనీ లిమిటెడ్ తాజాగా బీఎల్డీసీ టెక్నాలజీ ద్వారా నడిచే అత్యంత శక్తివంతమైన ఎయిర్ కూలర్ల శ్రేణిని ప్రపంచంలోనే మొదటిసారిగా ప్రారంభించింది. ఇతర కూలర్లతో పోలిస్తే ఇవి 60% తక్కువ విద్యుత్తును వినియోగిస్తాయి, ఫలితంగా సంవత్సరానికి రూ.2000 వరకు కరెంటు బిల్లు ఆదా అవుతుంది. 80 లీటర్లు, 55 లీటర్లు, 30 లీటర్ల వాటర్ ట్యాంక్ సామర్థ్యంతో బీఎల్డీసీ శ్రేణిలో 3 మోడళ్లను కంపెనీ విడుదల చేసింది. 7 స్పీడ్ ఆప్షన్లు, 8 గంటల వరకు నైట్ స్లీప్ మోడ్, టచ్ స్క్రీన్ కంట్రోల్ ప్యానెల్, వాటర్ ట్యాంక్ ఖాళీ అయితే అలారం లాంటి అదనపు ఫీచర్లు కూడా ఇందులో ఉన్నాయి.

హింద్ వేర్ తో భాగస్వామ్యం కుదుర్చుకున్న పంజాబ్ కింగ్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూర్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కంప్లీట్ బాత్రూమ్ సొల్యూషన్స్లో భారతదేశంలో అగ్రగామిగా ఉన్న కంపెనీ హింద్ వేర్ లిమిటెడ్. 5 స్టార్ హోటల్ ని తలపించే బాత్ రూమ్ లు అనే కాన్సెప్ట్ తో రూపొందించిన ఈ టెలివిజన్ కమర్షియల్స్ లో... రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరియు పంజాబ్ కింగ్స్కు చెందిన ప్రముఖ ఆటగాళ్లు నటించారు.హింద్వేర్ లిమిటెడ్ భారతదేశంలో ఎంతో నాణ్యమైన బాత్ రూమ్ ఉత్పత్తుల్ని సరసమైన ధరలకు అందిస్తుంది. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీపడకుండా వినియోగదారులకు అవసరాలకు తీరుస్తుంది.

ఆధునిక ప్రేమను ప్రతిబింబించేలా ప్లాటినమ్ లవ్ బ్యాండ్‌లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్లాటినమ్, దాని విశ్వాంతరాల మూలం, కాలాతీత స్వభావం, ఈ జంటలు పంచుకున్న బంధాన్ని నిర్వచించే స్థిరత్వాన్ని సూచిస్తుంది. పీజీఐ ప్లాటినమ్ లవ్ బ్యాండ్స్ సీజన్స్ కలెక్షన్, ఈ ఆధునిక ప్రేమ భావాన్ని ఒడిసిపడతాయి. ఈ వేసవి వెడ్డింగ్ సీజన్‌లో, అరుదైన ప్రేమను నిర్వచించడానికి, సూచించడానికి అనువైన మార్కర్ కోసం అన్వేషిస్తుంటే, అత్యద్భుతంగా తీర్చిదిద్దిన ప్లాటినమ్ లవ్ బ్యాండ్‌ల శ్రేణి నుంచి ఎంచుకోండి.

ఈనెల 28, 29 తేదీల్లో రెన్యూఎక్స్ 2023

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈనెల 28. 29 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ లో రెండు రోజుల రెన్యూవబుల్ ఎనర్జీ ట్రేడ్ ఎక్స్ పో, రెన్యూఎక్స్ 7వ ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లుగా భారతదేశంలోని ప్రముఖ బి2బి ఎగ్జిబిషన్స్ నిర్వహణ సంస్థ ఇన్‌ఫార్మా మార్కెట్స్ ప్రకటించింది. భారతదేశంలోని ఇన్‌ఫార్మా మార్కెట్స్, రెన్యూఎక్స్ 2023 ద్వారా పునరుత్పాదక ఇంధన కొనుగోలుదారులు, విక్రేతలకు ఒక పరిశ్రమ వేదికను అందజేస్తుంది. వ్యాపార అవకాశాలను సృష్టించేందుకు, వారిని పరస్పరం అనుసం ధానం చేయడానికి, సహకరించుకోడానికి వీలు కల్పిస్తుంది. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ప్రదర్శనలలో ఒకటైన రెన్యూఎక్స్ 2023, రెండు రోజుల ఎలైట్ కాన్ఫరెన్స్ ఫోరమ్‌లో పరిశ్రమల పోకడలు, సవాళ్లు, మార్కెట్ దృక్పథాలను చర్చించడానికి దక్షిణ భారతదేశ గ్రీన్ ఎకానమీ కమ్యూనిటీకి సంబంధించిన ఒక సమూహాన్ని చూడనుంది.

మీ కళాశాలలో సాంకేతిక జాతీయ ప్రదర్శన

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐ.ఈ.టి.ఈ - ఐ.ఎస్.ఎ.ఫ్ ఆధ్వర్యం లో సాంకేతిక జాతీయ ప్రదర్శన శుక్రవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీ కిరణ్ తెలిపారు. ఈ ప్రదర్శనలో భాగంగా వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు సాంకేతిక పోటీలలో పాల్గొని వారి నైపుణ్యతను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు కళాశాల యాజ మాన్యం, అధ్యాపకులు పుర స్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో పోటీ తత్వము కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సి.ఇ. ఓ డి. పాండు రంగా రావు, మేనేజ్ మెంట్ మెంబర్ ఎం. సుహాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీ కిరణ్, ఇ.సి.ఇ విభాగాధిపతి డాక్టర్.సి.హెచ్ పుల్లారావు, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిబి సిద్ధార్థ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

300 మందికి వైద్య సేవలు

విశాలాంధ్ర -విజయవాడ ఎడ్యుకేషన్ : విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) ఆధ్వర్యంలో ఏడురోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా విజయవాడ రూరల్ మండలం పాతపాడు జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పాతపాడు సర్పంచ్ దేవగిరి సుజాత ప్రారంభించారు. చిన అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి వివిధ విభాగాలకు చెందిన 15 మంది డాక్టర్లు, మరో 15 మంది సహాయక సిబ్బంది ఈ ఉచిత వైద్య శిబిరంలో సేవలందించారు. పాతపాడు, కుందావారి కండ్రిక, సీతారాంపురం, వెంకటాపురం గ్రామాల నుండి సుమారు 300 పైగా ఈ ప్రత్యేక శిబిరంలో వైద్య సేవలు పొందారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో బిపి, మధుమేహం మొదలైన పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్య సలహాలు అందించారు. కంటి పరీక్షలు చర్మ వ్యాధుల పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో కొనసాగించడం జరిగింది పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు కంటి పరీక్షలు మరియు దంత పరీక్షలు నిర్వహించి సరైన ఆరోగ్యాన్ని పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్లు ఎదపూడి సుభాకర్, దేవిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సిద్ధార్థ లా కాలేజీ ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ పాండు రంగారావు పాల్గొన్నారు.

లయోలా ఇంజినీరింగ్ కాలేజీలో మ్యూజియం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్ర లయోలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్అండ్ టెక్నాలజీలో పురాతన వస్తువులతో ఏర్పాటు చేసిన మ్యూజియంను సాహితీవేత్త డి.విజయభాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యూజియంలు కళాత్మక, సాంస్కృతిక, చారిత్రక, సాంప్రదాయ, శాస్త్రీయ ఆసక్తితో ఉన్న వస్తువులు మనకు జ్ఞానాన్ని అందించటమే కాకుండా మన దేశ చరిత్ర, సంస్కృతిని కూడా పరిచయం చేస్తాయని చెప్పారు. ఈ మ్యూజియంలో అరుదైన కళాఖండాలు, వస్త్రాలు, గడియాలు, గుర్రపు స్వారీ రథం, ద్రవిడ ముఖ శిల్పం, రాతి పనిముట్లు వంటివి ఎన్నో ఇక్కడ ఉంచారు. ఈ కార్యక్రమలో కళాశాల కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ జేవియర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఓ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ బాలస్వామి, సిస్టర్ క్యాండీ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చివేత అన్యాయం

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : పేదల ఇళ్లు కూల్చివేయడం అన్యాయమని తెలుగుదేశం పార్టీ 46 మాజీ అధ్యక్షులు గుర్రం కొండ అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 46వ డివిజన్ డాక్టర్ కే.ఎల్.రావు పార్క్ వద్ద ఎప్పటినుంచో నివాసం ఉంటున్న పేద ప్రజల ఇళ్లను శుక్రవారం అక్రమంగా, ఆకారణంగా కూల్చడంతో నిరాశ్రయులయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే కొండతో తెలుగుదేశం పార్టీ నాయకులు కాండ్రేగుల రవీంద్ర ఆ ప్రాంతాన్ని సందర్శించి ఈ అప్రజాస్వామ్యానికి ప్రభుత్వంలో అక్రమ కూల్చివేతను ఖండిస్తూ రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగోతి రామారావు, దిటి ప్రభుదాస్, పోతినేడి లోకేష్, ఎస్ కె అశ్రద్ధ, కొత్త రాము తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలలో ఇంటర్‌కు దరఖాస్తులు

విశాలాంధ్ర-గంపలగూడెం : స్థానిక కేజీబీవీల ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం. వెంకటలక్ష్మి శనివారం తెలియజేశారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డు తో పాటు , తల్లిదండ్రుల ఆధార్ కార్డు, పుట్టిన తేదీ, కుల ధ్రువీకరణ, పాస్పోర్ట్ ఫోటోతో, ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు .వీలు కాని వారు పాఠశాల సమయంలో సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానానికి సమయం ఉన్నదని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. వెంకటలక్ష్మి విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ ర్యాంకే లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : విజయవాడ నగర పాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రధర ర్యాంకే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్వచ్ఛ్ సర్వేక్షన్ 2023లో వీఎంసీకి ప్రథమ ర్యాంక్ వచ్చేందుకు తీసుకోవాల్సిన ఆధునిక పారిశుధ్య విధానాలు అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు, లీడ్ వర్కర్లుకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధానంగా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు 100 శాతం బాస్కెట్ కలెక్షన్ చేయటం ద్వారా నగరాన్ని క్లీన్‌గా ఉంచవచ్చన్నారు. డివిజన్‌లోని ప్రతి వీధిలో ఉన్న రోడ్డు మర్జిన్లలో పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు పూర్తిగా తొలగించేందుకు కనీసం నెలకు రెండు సార్లు అన్ని వీధులు కవరయ్యే విధంగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. డ్రెయిన్లలో మురుగునీరు పారుదలకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, డ్రెయిన్లలో ఏర్పాటు చేసిన స్క్రీన్స్ వద్దకు చేరిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్ల మర్జిన్లు, ఖాళీ స్థలాల్లో చెత్త లేకుండా చూడాలని, ఏపీ ట్రాన్స్, ప్రజలుకాని కట్ చేసిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అవసర మైన చోట యాంటీ లిట్టర్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత భద్రతపరికరాలయిన చెప్పులు, రేడియం జాకెట్స్, ఉండేలా చూడాలని, డోర్ టు డోర్ కలెక్షన్‌కి ఉపయోగించే క్లాప్ ఆటోలను వారానికి రెండు సార్లు వాటర్ సెర్విసింగ్ చేయించి పరిశు భ్రంగా ఉంచాలన్నారు. నగరంలో ప్రతి రోజు సిల్ట్ తొలిగించే బ్యాచ్ ద్వారా కాలువల్లో సిల్ట్ తొలిగించాలని, మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ నిర్వహించాలన్నారు. పారిశుధ్య నిర్వాహణలో వచ్చే వ్యర్థాలను ప్రతి సర్కిల్‌లో 3 కంపాక్టర్ వెహికల్స్ ద్వారా తొలగించాలన్నారు. ప్రజలు ఉత్పత్తి చేస్తున్న చెత్తతో పాటు పరుపులు, నిరుపయోగంగా ఉన్న కుర్చీలు, కూలర్లు, ధర్మోకోల్ మెటీరియల్స్ ఎప్పటికప్పుడు తొలగించేందుకు ప్రస్తుతం ఉన్న 14 కాంట్రాక్టర్‌తో పాటు మరో 7 ట్రాక్టర్స్‌ను తీసుకోని నగరాన్ని అను నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుద్య ప్రణాళికలు తాయారు చేసి అమలు చేయాలని తెలిపారు. ప్రతి డివిజన్‌లో 3 ప్రాధాన్యత కలగిన ఫోటోలు తిసుకోవాలని శానిటరీ సెక్రెటరీలకు సుచించారు. నగరంలో ఉండే సీటీ, పీటీ, యురినల్స్ నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన జాగ్రత్తలు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కే.సత్యవతి, సీఎంవోహెచ్ డాక్టర్ కే.రత్నావళి, ఏఎంవోహెచ్‌లు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, లీడ్ వర్కర్లు పాల్గొన్నారు.

ముస్లింలను మోసం చేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో ముస్లీంలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన మోసం గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేదని నవరంగ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అరోపించారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా ముస్లీం అందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ముస్లిం ఐక్యవేదిక అంజుమన్ ఇస్లామిక్ కమిటీ ద్వారా గత 20 సంలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా పేద ముస్లిం సోదర సోదరీ మణులకు వితంతు, నిరుపేదలకు రంజాన్ మాసంలో నూతన వస్త్రాలతో పాటు అర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. తమ పార్టీ రానున్న సాధారణ ఎన్నికల్లో అన్ని రాష్టాలలో పోటీ చేస్తుందని కేంద్రంలో మోదీ ,రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు మరలా రారుండా ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు చేస్తూంటే చాలా దారుణంగా ఉన్నాయన్నారు. ముస్లీంలపై నిత్య దాడులుజరుగుతున్నాయన్నారు. ప్రశ్నించే వారిపై పోలీసు,సిఐడి అంటూ భయభంత్రాలకు గురి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రంజాన్ తోఫా,దుల్హన్ పథకం వంటివి చేపట్టడం వలన పేద ముస్లీంలకు ఎంతో ప్రయోజనం కలిగిందన్నారు. జగన్ ప్రభుత్వం వాటికి తిలోదకాలు ఇచ్చిందని దాంతో రంజాన్ పండుగను పేద ముస్లీంలు చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.రాష్ట్రంలో నిత్యవసర సరుకులతో పాటు అన్ని పెరిగిపోవడంతో పేదజీవితాలు చాలా దుర్భలంగా తయ్యారు అయ్యిందన్నారు. మైనార్టీ కార్యొరేషన నిధులు, విజయవాడ హజ్ హౌస్ నిర్మాణం,మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు లోన్ సదుపాయ, విద్యా ఉపాధి రంగాలో ముస్లిం లకు అందవలసిన సంక్షేమ పథకాలు ఇవ్వడం లో ఈ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు.విదేశీ విద్య కోరకు నిధులు కేటాయించక పోవడం భాదకరం అని అవేదన వ్యక్తం చేశారు. త్వలరో జరగనున్న కర్ణాటకలో కొన్ని స్థానాలకు పోటీ చేసి విజయం సాధించబోతున్నామన్నారు.ముస్లింలకు ధమాషా ప్రకారం ఉన్న రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాజ్యాధికారంలో ముస్లిం లకు భాగ్యస్వామ్యం చేయడం లో విఫలం అయింది. ఇప్పటికైనా రాష్టం ప్రభుత్వానికి కనువిప్పు కలిగి రంజాన్ సందర్భంగా ప్రతి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించాలన్నారు.

వేసవిలో ప్రయాణికులు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వేసవిలో రైల్వే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ అధ్వర్యంలో మజ్జిగ,మంచినీళ్ళు పసిపిల్లలకు టెట్రా ప్యాక్లిలు,పాలు వంటివి అందింస్తున్నామని రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు డాక్టర్ జయమోహన్ తెలిపారు.శుక్రవారం ఆర్గనైజేషన్ సభ్యులు స్వయంగా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు,రైలు డ్రైవర్లకు ఎండ వేడిమి నుండి ఉపసమనం పొందో విధంగా కూలింగ్ మంచినీళ్ళు ,మజ్జిగ అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడ రైల్వే స్టేషన్‌లో సుమారు 1500 మంది ప్రయాణికులకు వెన్న మిల్క్ ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు.రైల్వే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకంగా పంపిణీ చేపట్టామన్నారు. సాంఘిక-సంక్షేమ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున, సన్ స్ట్రోక్‌లను నివారించడానికి టోపీలు,ఇతర రక్షణ గేర్‌లను ధరించాలని రైల్వే సిబ్బందికి విజ్ఞప్తి చేశారు.వేసవిలో ప్రయాణాల సమయంలో ప్రయాణికులలో చెట్లను నాటడం, షెల్టర్ల ఏర్పాటు,సంసిద్ధత వంటి చైతన్యం తీసుకురావడానికి రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను చేపట్టబోతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ సి.బి.ఎస్ ప్రసాద్,స్కౌట్స్& గైడ్స్, ఆపరేటింగ్,టిక్కెట్ చెకింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మలకు అండగా వైసీపీ ప్రభుత్వం

ఎమ్మెల్యే మల్లాది

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అక్కాచెల్లెమ్మలకు అర్ధికంగా పెద్దదిక్కువగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉంటోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ అన్నారు. స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న మెప్మా, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మహిళా పొదుపు సంఘాల మహిళలచే నిర్వహిస్తోన్న మెప్మా అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే, నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు సంఘాలకు సున్నా వడ్డీకి రుణాలు, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా దేశంలో ఎక్కడా లేనివిధంగా అక్క చెల్లెమ్మలకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. పొదుపు సంఘాల మహిళలకుకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చటమే కాకుండా వారితో వ్యాపార కార్యక్రమాలు నిర్వహించి వారి వ్యాపారాభివృద్ధికి, మార్కెటింగ్‌కు మెప్మా అర్బన్ మార్కెట్లు ఏర్పాటుకు ఈ రోజు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పొదుపు మహిళలకు మార్కెటింగ్‌కు అవకాశం కల్పిస్తూ, అటు పట్టణ ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావడం మంచి పరిణామన్నారు. మేయర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు మెప్మా అర్బన్ మార్కెట్‌ను సందర్శించి పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ ఎ.శైలజారెడ్డి, కార్పొరేటర్ కే.అనిత, యూసీడీ పీవో కే.శకుంతల, టీఐలు మమత, శేఖర్, సీడీఓ జగదీశ్వరి, సోషల్ వర్కర్‌లు, కమ్యూనిటి ఆర్గనైజర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెడన : మండలం ఈదుమూడి గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురైన రెండు కుటుంబాల వారికి టిడిపి తరఫున 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కాగిత కృష్ణ ప్రసాద్ గ్రామానికి వెళ్లి బాధ్యత కుటుంబానికి ఈ సాయాన్ని అందించారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జ వెంకట నగేష్ మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పోలగాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రువారం దుర్గా పురం శానిటరీ ఇనస్పెక్టర్ కార్యాలయం సమీపం లో వేసవి తీవ్రత దృష్ట్యా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా శానిటరీ ఇనస్పెక్టర్ రామ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో మజ్జిగ పంపిణీ చేయడం ద్వారా పాదచారుల దాహార్తిని తీర్చేందుకు సొసైటీ నిర్వాహకులను అభినందించారు,దాత విశ్రాంత పోలీస్ అధికారి యం,చెన్నారెడ్డి కి సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయ గుంట రాము ధన్యవాదములు తెలిపారు,దాతలు మజ్జిగ పంపిణీ కార్యక్రమం కు సహకరించాలని కోరారు,ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్,గుర్రం ఏడు కొండలు,దాచే పల్లి శ్రీనివాస్,బత్తిన సీతారామయ్య,ఈమని శ్రీధర్, బాడిత అప్పారావు,నాగేశ్వర రావు,కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం వైఎస్సార్‌క్రాంతి పథం కార్యాలయం నందు డ్వాక్రా మహిళా సాధికారిత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లబ్ధిదారులకు గొర్రెలను రెడ్డిగూడెం జడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలో 20 మంది లబ్దిదారులకు శ్రీనిధి, లింకేజీ రుణాల ద్వారా ఒక్కొక్క యూనిట్ కింద 6 గొర్రెలు, ఇన్సూరెన్స్, మెడికల్ కిట్‌లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళల యొక్క జీవనోపాధిని మెరుగుపర్చటానికి, అర్థికంగా అభివృద్ధి చెందటానికి దోహదపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణీ, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, రెడ్డిగూడెం ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వర ప్రసాద్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరెడ్డి, రామినేని వీరస్వామి నాయుడు, గుజ్జుట కోటిరెడ్డి, ఎంపీడీఓ శంకరరావు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, మండల సమాఖ్య ప్రెసిడెంట్ గుంటక వెంకట్రావమ్మ, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న కొడాలి నాని : రావి

విశాలాంధ్ర-గుడివాడ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని గుడివాడ అభివృద్ధికి కనీసం గుప్పెడు మట్టి కుడా పోయలేదని. కానీ మట్టిని మాత్రం అక్రమంగా తరలించి లక్షాలాధి రూపాయిలను దొచ్చుకన్నడాని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ తమ పార్టీ యువ నాయకుడు నారా లోకేష్ యువత కోసం యువగళం పాదయాత్ర 77వ రోజు 1000 కిలో మీటర్లు పూర్తి చేసుకోవడం, అయనకు ప్రజల నుండి వస్తున్న స్పందన మద్దతుతో మిగిలిన 3వేల కిలో మీటర్లు పూర్తి చేసుకోవలన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జగన్ పుట్టినరోజును టిట్కో ఇల్లు ఇవకపోతే కొడాలి నాని రాజకీయలో నుండి వైదులుగుతన్నాడు. ఎందుకు రాజీనామ చేయాలేదో చెప్పాలన్నారు. టిట్కో గృహలు కట్టింది ఎవరు. మేము కట్టిన వాటికి నీవు ఎదో సాధించినట్లు చెబుతునవన్నారు. గుడివాడ నుండి నీకు మంత్రి పదవి ఇస్తే నీవు 5వేల కోట్లు మట్టి, ఇసుక, పేకాట, గంజాయిల వ్యాపారం చేసి సంపాదించావన్నారు. లోకేష్ పాదయాత్రకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదలు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రూరల్ అధ్యక్షుడు వాసే మురళీ, నాయకులు పంద్రాజు సాంబశివరావు, పోలాసి ఉమా, కంచర్ల సుధాకార్, షేక్ జానీషరీఫ్, గోవాడ శివా, షయ్యద్ జబీన్, వేణు, అల్లాడ శ్రీను, పట్టపు చిన్నా, సాల్మన్, దేవాధి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబటి బ్రాహ్మణయ్య 10వ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - గుడివాడ : టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపి అంబటి బ్రహ్మణయ్య 10వ వర్ధంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అధ్వర్యంలో నిర్వహించారు, శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో అంబటి బ్రహ్మణయ్య 10వ వర్ధంతి సందర్భంగా అయన చిత్ర పటాటినిక పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ సర్పంచ్ నుండి పార్లమెంట్ సభ్యుడి వరకు ప్రజల సేవలు అందించిన నాయకుడు అంబటి బ్రహ్మణయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ అధ్యక్షుడు వాసే మురళీ, పట్టణ కార్యదర్శి పోలాసి ఉమామహేశ్వరరావు, నాయకులు పంద్రాజు సాంబశివరావు, కంచర్ల సుధాకార్, షేక్ జానీషరీఫ్, గోవాడ శివా, షయ్యద్ జబీన్, వేణు, అల్లాడ శ్రీను, పట్టపు చిన్నా, సాల్మన్, దేవాధి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'స్కూల్ పెర్ఫార్మన్స్ ఎవల్యూషన్ టూల్'పై శిక్షణ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ శ్రీ మండవకనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 59 పాఠశాలలు (8 జిల్లా పరిషత్ హై స్కూల్స్ంఒక ఎయిడెడ్ హై స్కూల్ంమూడు యుపి పాఠశాలలుం47 ఎలిమెంటరీ పాఠశాలలు) ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం"స్కూల్ పర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ టూల్"అంశంపై ఒకరోజు శిక్షణ తరగతులను విద్యాశాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్ పర్సన్ పి.జయంతి (హెచ్ఎం, మోపిదేవి) ప్రధానోపాధ్యాయుల ఉద్దేశించి ప్రసంగిస్తూ పాఠశాలలో నిర్వహించాల్సిన సోషల్ ఆడిట్ వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రతి పాఠశాలకు సోషల్ ఆడిట్ ఆవశ్యకతను వెల్లడించారు. ఇదిలా ఉండగా ఈనెల 24 నుంచి 29వ తారీకు లోపుగా విద్యాశాఖ కేటాయించిన యాప్ లో నాడు ఎనేడు కుముందు పాఠశాల భౌతిక వనరులు, అలాగే ప్రస్తుతం పాఠశాలలో గల ఉపాధ్యాయులు, విద్యార్థులు, జగనన్న గోరు ముద్ద, తదితర అంశాలను ఆ యాప్ లో పూజ చేసి ఆన్లైన్ చేయాల్సిందిగా ఆమె సూచించారు. దీనిలో విద్యార్థుల తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేయాలని విశదీకరిస్తూ యాప్ లో పొందుపరిచిన 100 కు పైగా గల ప్రశ్నలను పూర్తి చేయాలని సూచించారు.దీనితో పాటు వివిధ అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి నారేపాలెం శివశంకర్ అధ్యక్షత వహించారు.

అంగన్వాడి సహాయకుల పోస్టులు భర్తీకి నోటిఫికేషన్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని ఖాళీగా ఉన్న నాలుగు అంగన్వాడి కేంద్రాలలో సహాయకుల పోస్టులుకు మే ఒకటవ తారీకు లోపుగా దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని శుక్రవారంసిడిపిఓ పి. భానుమతి వెల్లడి చేశారు. మొవ్వ-3వ కేంద్రం (బీసీ -ఏ), పెదపూడి-2 వ కేంద్రం, (జనరల్), వెలివోలు-1వ కేంద్రం (బీసీ- ఏ), ఘంటసాల-7వ కేంద్రం (ఎస్ సి) లలో ఖాళీలకు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని సూచించారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను ఆయా కస్టర్ సూపర్వైజర్ ల నుంచి సేకరించి వచ్చేనెల ఒకటవ తారీకు సాయంత్రం ఐదు గంటల లోపు కార్యాలయం పనిచేసే రోజులలో అందజేయాలన్నారు.